## 6

# “మేలైనదంతా మంచితోనే అంతమౌతుంది!”

## (యోబు 42:12-17)

ఒక గొప్ప నాటకానికి యోబు గ్రంథం చివరి ఆరు వచనాలు క్లైయిమాక్స్ అనుభవాలను ప్రసాదిస్తాయి. కేవలం 42:12వ వచనం చదవడానికి ఆ గ్రంథమంతా పఠించడం తగినదై ఉంటుంది: “యెహోవా యోబును మొదట ఆశీర్వదించినంతకంటె మరి అధికముగా ఆశీర్వదించెను” దేవుడు ఆశీర్వదించునని తెలుసుకో! దుర్దశలో కూడ దేవుడు ఆశీర్వదిస్తాడు. మన కష్ట కాలాంతములో విలువైన పాఠాలను నేర్చుకున్న పిమ్మట లేదా శ్రేష్ఠమైన జనులుగా రూపొందిన తరువాత, దేవుడు మనలను దీవిస్తాడు. చివరిలో దృఢత్వం కలిగినట్లయితే, అది మంచిది. “కార్యారంభము కంటె కార్యాంతము మేలు” అని సొలొమోను అన్నాడు (ప్రసంగి 7:8).

యోబు యొక్క శ్రమలు సంతోషకరమైన అంతాన్ని చూచాయి. దేవుని మహత్తరమైన శక్తిని గూర్చి అతడు తెలుసుకొనడం మాత్రమే గాక, దేవుని మహా గొప్ప కనికరమును కూడ అతడు అనుభవించాడు:

> మరియు యోబునకు పూర్వము కలిగిన దానికంటె రెండంతలు అధికముగా యెహోవా అతనికి దయచేసెను. అప్పుడు సహోదరులందరును అతని అక్క చెల్లెంద్రందరును అంతకుముందు అతనికి పరిచయులైన వారును వచ్చి, ....అతని ఓదార్చిరి. ఇదియు గాక ఒక్కొక్కడు ఒక వరహాను ఒక్కొక్కడు బంగారు ఉంగరమును అతనికి తెచ్చి ఇచ్చెను. యెహోవా యోబును మొదట ఆశీర్వదించినంతకంటె మరి అధికముగా ఆశీర్వదించెను. అతనికి 14,000 గొఱ్ఱెలును 6000 ఒంటెలును 1000 జతల ఎడ్లను, 1000 ఆడుగాడిదలును కలిగెను. మరియు అతనికి ఏడుగురు కుమారులును ముగ్గురు కుమార్తెలును కలిగిరి. ... అటు తరువాత యోబు 140 సంవత్సరములు బ్రతికి, తన కుమారులను కుమారుల కుమారులను నాలుగు తరములవరకు చూచెను. పిమ్మట యోబు కాలము నిండిన వృద్ధుడై మృతినొందెను (42:10-17).

యోబు శ్రమలను దేవుడు అంతమొందించి తాను పోగొట్టుకున్నదంతయు రెండు రెట్లు దయచేశాడు. యోబు బాగుపడిన పిమ్మట అతని అన్నదమ్ములు అక్కచెల్లెంద్రు అతని పరిచయస్థులు అతనితో కూడ భోజనము చేయవచ్చి, బహుమానాలిచ్చారు. అటు కుటుంబము, స్నేహితులు, యిటు దేవుని దీవెనలతో యోబు నూతన జీవితాన్ని ఆరంభించాడు. వాటిని కొనిపోబడకముందున్న దానికంటె అతని మందలు రెండంతలు

పెరిగాయి. అతనికి తిరిగి ఏడుగురు కుమారులు ముగ్గురు కుమార్తెలు కలిగారు – అతని కుమార్తెలవంటి సౌందర్యవంతులు ఆ దేశమందెచ్చటను లేరు. తన శ్రమల అనంతరం యోబు 140 సంవత్సరాలు జీవించాడు. అతడు తన నాల్గవ సంతానాన్ని చూచేవరకు బ్రతికి, మంచి వృద్ధాప్యములో మృతినొందాడు.

యోబు పోరాటపు గాథ, అతని అంతిమ విజయం మన సొంత సమస్యలను ఎదుర్కొనడానికి సహాయపడుతుంది. యోబు గ్రంథాన్ని రివ్యూ చేసి పోరాటాలను ఎలా ఎదుర్కోవాలో తెలుసుకొనడానికి అందులోనుండి కొన్ని పాఠాలను ఆలోచన చేద్దాం.

## పోరాట సమయములో చేయకూడనివేమి?

మొదటిగా ఆశను వదలుకోకు, తన పుట్టుకనతడు తిట్టుకున్నాడు. "పుట్టుకలోనే నేనేల చావకపోతిని" (3:11). ఎదురుచూడని జీవిత సమస్యలు ఎదుర్కొన్నప్పుడు ఈలాటి తలంపులు పుట్టుకొస్తాయి. అయితే యోబు ఎన్నడూ వదులుకోలేదు. యోబు సహింపును గూర్చి యాకోబు యిలా రాశాడు "మీరు యోబుయొక్క సహనమును గూర్చి వింటిరి" (యాకోబు 5:11). సణిగాడు, దేవుని ప్రశ్నించాడు గాని అతడెన్నడును దేవుని వీడలేదు.

శ్రమలను పౌలు ఏ స్వభావముతో ఎదుర్కొన్నాడో గమనించు: "ఎటుబోయినను శ్రమపడుచున్నను ఇరికింపబడువారము కాము; అపాయములో నున్నను కేవలము ఉపాయము లేనివారము కాము; తరుమబడుచున్నను దిక్కులేనివారము కాము; పడద్రోయబడినను నశించువారముకాము" (2 కొరింథీ. 4:8, 9). తన్ను ఏమి కావాలని దేవుడు కోరితే అలా ఉండడానికిని, ఏమి చేయాలని ఆయన కోరితే అలా చేయడానికిని అతడు సిద్ధంగా ఉన్నాడు, భూమిమీద జీవించి ప్రభువు కొరకు పని చేయడమా లేక యిక్కడనుండి వెళ్లి ప్రభువుతో కూడ ఉండడమా ఈ రెండింటిలో తానేమి కోరుకోవలెనో ఎరుగకయున్నట్టు పౌలు ఫిలిప్పీయులకు రాశాడు (ఫిలిప్పీ. 1:21–24). ఆ నిర్ణయము చేయవలసింది తాను కాదు, తన జీవితం కొరకు దేవుని తీర్మానమేదో దాన్ని అంగీకరించడానికి అతడు సిద్ధంగా ఉన్నాడు. తాను ఈ సంగతి రాసేటప్పుడు చెరసాలలో ఉన్న సంగతిని గుర్తు చేసికొంటె మరింతగా అవగాహనం కలుగుతుంది.

రెండవది, వెనుదిరుగకు. "దేవుడు నన్ను కాపాడుచుండిన దినములలో ఉన్నట్టు నేనున్నయెడల ఎంతో మేలు" (29:2) అని యోబు అంటాడు. మేలైన దినములలో ఉన్నట్టు మన జీవితం ఉండాలని కోరడంలో మేలు జరుగదు. తప్పని సరియైనప్పుడు మనం వాటిని గుర్తు చేసికోవచ్చు. జరిగిపోయిన దినాలను గుర్తుచేసికొనడంలో హాని ఏమీ లేదు; "గతించిన దినాలను" తిరిగి పట్టుకోగోరితే, మనం నిరాశ చెందుతాం. మంచి పాత దినాలను తెచ్చిన దేవుడే "మంచి నూతన దినాలను" కూడ తేగలడు. తిరిగి, పౌలు యొక్క స్వభావము సహాయపడుతుంది:

> సహోదరులారా, నేనిదివరకే పట్టుకొనియున్నానని తలంచుకొనను. అయితే ఒకటి చేయుచున్నాను; వెనుక ఉన్నవి మరచి ముందున్న వాటికొరకై వేగిరపడుచు క్రీస్తు యేసునందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని,

గురియొద్దకే పరుగెత్తుచున్నాను (ఫిలిప్పీ. 3:13, 14).

గతించిన మంచి దినములను తిరిగి కోరుకొనడం నిష్ప్రయోజనం – దేవుడు కలుగజేసిన దేవుని సృష్ట్యాదిని చేరడం ఎంత కష్టమో నిన్నటి దినాన్ని చేరడం కూడ అలాంటిదే. దానికి బదులు, రాబోవు మంచి దినాలకొరకు కనిపెట్టుదాం.

*మూడవది, ఆత్మ సానుభూతిని కలిగి ఉండవద్దు.* తన కష్టం ఎంత అధికంగా ఉన్నట్టు యోబు భావించాడంటే – సముద్రపు యిసుక కంటె ఎక్కువ భారమైనట్టు అతడు తలంచాడు (6:2, 3). యోబు తనపై తానే సానుభూతిని వెలిబుచ్చాడు. నీకు నీవే సారీ ఫీలయితే జరిగే తమాషా ఏమంటే, ఆ ఫీలింగ్ నీకు మాత్రమే ఉంటుంది. యోబు తప్ప యోబుకొరకు సారీ ఫీలింగు కనుపరచినవారెవరూ లేరు – దేవుడు కూడ అలా భావించలేదు. అతడు వారిని బతిమాలుకున్నా తన ముగ్గురు స్నేహితుల్లో ఏ ఒక్కడు అతని కొరకు దయ చూపినట్టు లేరు: "దేవుని హస్తము నన్ను మొత్తియున్నది నా మీద జాలిపడుడి నా స్నేహితులారా నా మీద జాలిపడుడి" అని యోబు తన స్నేహితులను బతిమాలుకొనుచున్నారు (19:21). అతని భార్య అతనిపై ఆదరణను చూపలేదు.

ఇశ్రాయేలీయుల సణుగుడు భారాన్ని భరిస్తున్నప్పుడు, మోషే తన కొరకు సారీ ఫీలింగ్ నిచ్చాడు. ఆలాటి భారాన్ని దేవుడు తనకు ఎందుకిచ్చాడో తాను అర్థం చేసికోలేక పోయాడు. "నేను వీరిని కంటినా? నేను యీ సర్వ జనమును గర్భము ధరించితినా? ... వీరిని నీ రొమ్మున ఎత్తికొని పొమ్మని నాతో చెప్పుచున్నావు" (సంఖ్యా. 11:12–15). తాను స్వయంగా ఆ ప్రజలందరి భారమును మోయలేకున్నందున, తన్ను చావనిమ్మని మోషే దేవుని వేడుకొనెను. దేవుడు మోషే సమస్యను పరిష్కరించాడు. ఆయన యోబు సమస్యను కూడ పరిష్కరించాడు. దేవుడు మనకు విరోధియైయున్నాడని కొన్నిసార్లు మనం తలంచవచ్చు. కాని ఆయన సర్వత్రా మన మేలుకొరకే పని చేస్తున్నాడు.

*నాల్గవది, వేరెవ్వరిని నీవు నిందించకు,* తమది న్యాయమని నిరూపించుకొన జూచుట ఏదెను తోటలోని సంభవమంత పాతది. దేవుడు ఆదాము హవ్వల పాపమును ఎదుర్కొని నప్పుడు, ఆదాము హవ్వను, దేవునిని కూడ నిందించాడు. "నాతో నుండుటకు నీవు నాకిచ్చిన ఈ స్త్రీయే ఆ వృక్ష ఫలములు కొన్ని నాకియ్యగా నేను తింటిననెను" (ఆది 3:12). హవ్వ సాతానుని సాధించింది. "స్త్రీ – సర్పము నన్ను మోసపుచ్చినందున తింటిననెను" (3:13).

తన బాధలకొరకు ఎవరో ఒకరిని నిందించాలని యోబు తలంచాడు. వాటికి తాను బాధ్యుడు అన్న విషయాన్ని అతడు నమ్మలేదు. ఈ పోరాటాన్ని యింకా ఎవరికి ఆరోపించాలో కూడ అతనికి తెలియలేదు. గనుక అతడు దేవుని ప్రశ్నించాడు. ఎవరో ఒకరిమీద నింద పెట్టాలనే ఆలోచన సమస్యలను పరిష్కరించదు. ఏదైనా, లేక ఎవరైనా బాధ్యులైయుంటారని వారికొరకు వెదకడంలోనే అపవాది మనలను నిలిపి, సమస్యలు పరిష్కరింపబడకుండేలా బాధిస్తాడు.

## పోరాట సమయంలో ఏమి చేయాలి?

మొదటిగా, దేవునియందు నమ్మికయుంచు. మనం యోబును (43:12) జ్ఞాపకం చేసికోవాలి: "యెహోవా యోబును మొదట ఆశీర్వదించినంతకంటె మరి అధికముగా ఆశీర్వదించెను. యెహోవా ఆశీర్వదిస్తాడు! సూర్యుడు అస్తమిస్తాడు, కాని సూర్యుడు ఉదయిస్తాడు కూడా" (ప్రసంగి 1:5). దేవుని మనమెన్నడు ప్రశ్నించ కూడదు; ఆయనయందు నమ్మికయుంచాలి. "పరిస్థితులు విషమిస్తున్నప్పుడు," అది దేవునినుండి దూరంగా తొలిగిపోయే సమయం కాదు. కష్టకాలాలు ఎదురైనప్పుడు దేవుని యింటనుండి ఎందరు దూరంగా తొలిగిపోతారో? దేవుని యిల్లు లేక కుటుంబం యిలాటి సమయాల కొరకే ప్రత్యేకంగా ఏర్పరచబడింది! కష్టకాలంలో నిలకడగా ఉండని విశ్వాసం బలహీనమైన విశ్వాసం. యోనా తీక్షణమైన పరీక్ష ఎదుర్కొన్నప్పుడు, దేవుని అతడు అత్యధికంగా నమ్ముకున్నాడు. చేప గర్భంలోనుండి అతడు యిలా మొరపెట్టాడు: "కూపములోనుండి నా ప్రాణము నాలో మూర్ఛిల్లగా నేను యెహోవాను జ్ఞాపకము చేసికొంటిని; నీ పరిశుద్ధాలయములోనికి నీ యొద్దకు నా మనవి వచ్చెను" (యోనా 2:7).

ఆగి ఆలోచన చేద్దాం. "మీరు పడకలమీద నుండగా మీ హృదయములలో ధ్యానము చేసికొని ఊరకుండుడి" (కీర్తన. 4:4); "భయపడకుడి, యెహోవా మీకు నేడు కలుగజేయు రక్షణను మీరు ఊరక నిలుచుండి చూడుడి" (నిర్గమ. 14:13). మానవ శక్తిని ఉపయోగించి మన సమస్యలను పరిష్కరించుకొనుట మానాలి. "కాలిజోళ్ల తాళ్లతో మనలను మనం పైకి లేపుకొనలేం." మనము మనలను, మన సమస్యలను దేవునికి అప్పగించుకోవాలి. సమస్య తీర్చే దేవుని సూత్రమిది: "దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్ఠమైన చేతి క్రింద దీనమనస్కులై యుండుడి. ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు గనుక మీ చింత యావత్తు ఆయన మీద వేయుడి" (1 పేతురు 5:6, 7). పేతురుకు ఎంతో ముందుగా యోబు జీవించాడు. కాని పేతురు బోధించినది యోబు చేసినప్పుడు, అంటే ఏ సూత్రాన్ని పేతురు తెలిపాడో దానిని యోబు జీవిత ఆచరణలో పెట్టాడో, అప్పుడు దేవుడు అతని హెచ్చించాడు.

రెండవది, దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించు. ఆయన తనకు ఏమి ప్రసాదిస్తే బాగుండునో అని వ్యసనపడే దానికంటె, ఆయన మనకు దయచేసినవాటి నిమిత్తమే కృతజ్ఞతాస్తుతులు చెల్లింపబద్ధులమై ఉందుము. ఒక వారంరోజుల పాటు ఏమి అడుగకుండ – దేవుడు ముందుగా చేసిన వాటికి కేవలం కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడని ఒక స్త్రీల బైబిలు క్లాసులో అడిగాను. దేనినే అడగకుండ దేవునికి ప్రార్థించేలా మాటలను పొందుపరచడం కష్టంగా ఉన్నట్టు తరువాత వారపు క్లాసులో చాలమంది స్త్రీలు అన్నారు. మన అవసరతల కొరకు దేవుని అడగడంలో ఏమీ తప్పులేదు సుమీ–లేక ఏది అవసరమని తలంచుతామో దాన్ని అడగడం తప్పు కాదు. అడుగమని ప్రభువు తన శిష్యులకు బోధించారు (మత్తయి 7:7). మనం ఏమి అడుగుతున్నామో అవి మనకు అవసరం లేదని ఆయన తలంచవచ్చు. అట్టి సందర్భంలో, ఆయన "లేదు" అని చెప్పవచ్చు (2 కొరింథీ. 12:7–9). "ఓరిమి కలిగియుండు" అని కూడ ఆయన చెప్పవచ్చు. అయితే జవాబు ఏదైయున్నా, మనం ఆయన జవాబును అంగీకరించి తీరవలసిందే. కీర్తన.

27:14 యిలా అంటుంది, “యెహోవా కొరకు కనిపెట్టుకొని యుండుము, ధైర్యము తెచ్చుకొని నీ హృదయమును నిబ్బరముగా ఉంచుకొనుము.”

దేవుడు మనకు ఏమి ప్రసాదించాడో, కేవలం దానికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట మాత్రమే గాక, మనకు ఆయన దయచేయు వాగ్దానం చేసినవాటి కొరకు కూడ కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి. మన కొరకు సిద్ధపరుస్తానని ప్రభువు వాగ్దానం చేసినందుకు కృతజ్ఞతలు చెల్లించాలి (యోహాను 14:2, 3). అన్ని విషయములలో కృతజ్ఞతగలవారమై ఉండాలని మనం బోధింపబడ్డాం: “ప్రతి విషయమునందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. ఈలాగు చేయుట యేసు క్రీస్తునందు మీ విషయములో దేవుని చిత్తము” (1 థెస్స. 5:18).

నా చిన్నతనంలో ఒక బ్రహ్మచారి మా నాన్నతోపాటు వేటకెళ్లడం చూసి నాకు ఆనందం కలిగేది. మేము రాత్రి భోజనం చేసే సమయానికి కొన్నిసార్లు అతడు వచ్చేవాడు. ఇక భోజనానికి కూర్చునేముందు – “భోజనానికి వందనాలు అమ్మా” అనేవాడు. అప్పటికి అతడింకా ఏమి తినలేదు, తాను అక్కడ తినబోతాడని అతనికి తెలుసు. మనం పొందబోయే దీవెనలకొరకు కూడ మనం అలాగే దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించవచ్చు – యింకా దాన్ని మనం పొందక పోయినప్పటికిని మన దీవెనలన్నిటిని మనం లెక్కించుకొన బద్ధులమైయున్నాం – అవి గతానివో, ప్రస్తుతానివో, భవిష్యత్తువో!

మూడవది, సద్భావనతో ఆలోచించు. అది సమస్యను ప్రదర్శించేదానికంటెను, పరిష్కారము సూచించేదిగా ఉండడం ఉత్తమం. పరిష్కారాలను గూర్చి మాట్లాడుకునే దానికంటె – సమస్యలను గూర్చి మాట్లాడుకొనడంలోనే మనం ఎక్కువ కాలం గడుపుతాం. సహోదరులు సమస్యలను చర్చించకుండా ఉంటే, సంఘ కార్యక్రమాల కూడికలు తక్కువ కాలంలోనే ముగించబడతాయి. ఒక అరగంట సేపు ఒక సమస్యను గూర్చి మాట్లాడి, సాధ్యమయ్యే పరిష్కారాలను గూర్చి చర్చించకయే మరొక “సమస్య” దగ్గరకు వెళ్లడం సాధారణమయ్యింది. ఇది మన ఆలోచనా విధానాన్ని గూర్చి ఎంతగానో తెలుపుతుంది. మనం సమస్యలను, ఆటంకాలను, పతనాలను గూర్చి మాట్లాడుతూ ఉంటాం. ప్రజలు అవకాశాలను గూర్చి వినగోరతారు, పరిష్కారాలను గూర్చి ఆలోచిస్తారు, విజయాలను వీక్షింప జూస్తారు.

మనం విజయాన్ని ఎదురుచూడాలని దేవుడు కోరుతూ ఉంటాడు (1 కొరింథీ. 15:57). తన శక్తిని వినియోగించుకొమ్మంటాడు (2 తిమోతి 1:7). దేనిని గూర్చియు చింతించవద్దని ఆయన ఊరడిస్తాడు ( ఫిలిప్పీ. 4:6), మనలను బలపరచు క్రీస్తుయేసు ద్వారా ఆయన కోరే సమస్తాన్ని చేయగలమని ఆయన నమ్మమంటాడు (ఫిలిప్పీ. 4:13). మంచివాటిని యోచించునట్లు ఆయన ప్రోత్సహించుతాడు (ఫిలిప్పీ. 4:8). “ప్రభువు నాకు సహాయకుడు, నేను భయపడను, నరమాత్రుడు నాకేమి చేయగలడు?” అనే మంచి ధైర్యముతో చెప్పగలవారమై ఉండాలని, బలవంతులమై ఉండాలని ఆయన కోరుకుంటాడు (హెబ్రీ. 13:6). “యెహోవా నాకు వెలుగును రక్షణయునైయున్నాడు నేను ఎవరికి భయపడుదును?” అని దావీదు అన్నాడు (కీర్తన. 27:1).

మన సమస్యలకు పరిష్కార చర్యలను దేవుడే తీసికొంటాడనే నమ్మిక కలిగియున్నవారు

నిశ్చయముగా ఆశయముగల క్రైస్తవులైయున్నారు. దేవునియందు నమ్మికయుంచి, మన మనుభవించే దీవెనలకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించువారమైయున్నప్పుడు, నిశ్చయమైన రూపంలో మనం ఆలోచిస్తాం, నిశ్చయమైన విధానంలో కార్యాలను జరిగిస్తాం.

కేవలం అక్కడే కూర్చోకు, అక్కడే నిలువకు, అక్కడే తుప్పుపట్టి పోకు! ప్రభువు నామంలో ఏదో ఒకటి చేస్తూ ఉండు. కీర్తన. 23 గాని లేక 27 గాని చదువ నారంభించవచ్చు. "యెహోవా నా కాపరి, నాకు లేమికలుగదు" అంటూ దావీదుకు ప్రియమైన కీర్తన ఆరంభమౌతుంది. "యెహోవా నాకు వెలుగును రక్షణయునై యున్నాడు నేను ఎవరికి భయపడుదును?" అని కీర్తన. 27 అంటుంది. మన పోరాటాలను ఎదుర్కొనడానికి అవసరమైన ప్రోత్సాహమును ఈ లేఖన భాగాలు యిస్తాయి. పౌలు తిమోతిని యిలా హెచ్చరించాడు: "నేను వచ్చువరకు చదువుటయందును, హెచ్చరించుట యందును, బోధించుటయందును జాగ్రత్తగా ఉండుము. ...నీ అభివృద్ధి అందరికి తేటగా కనబడు నిమిత్తము వీటిని మనస్కరించుము, వీటియందే సాధకము చేసికొనుము" (1 తిమోతి 4:13-15).

"ఎల్లప్పుడును ప్రభువునందు ఆనందించుడి, మరల చెప్పుదును ఆనందించుడి!" అని కూడ పౌలు అన్నాడు (ఫిలిప్పీ. 4:4). దేవుని వద్దనుండి వచ్చు బలముతో, పోరాటములయందును మనము ఆనందించగలము. "సంతోష హృదయునికి నిత్యము విందు కలుగును" (సామెతలు 15:15).

## ముగింపు

ఆనందంగా అంతమయ్యే కథలంటే నాకు బహు యిష్టం. మన జీవితాలు సంతోషంగా అంతమవ్వగలవని అవి సూచిస్తుంటాయి. యోబు బాధలు బహు తీవ్రమైనవి, అయితే అవి అంతరించినప్పుడు తన జీవితం శ్రేష్ఠమైనదిగా ఉంది, అతని శీలము ఎక్కువ బలీయంగాను ఉంది, మరియు దేవుని పట్ల అతని ప్రేమ గొప్పదిగా ఉంది. భవిష్యత్ శ్రమలకు అతడు బహుగా సన్నద్ధుడైయున్నాడు.

యాకోబు యిలా అన్నాడు: "నా సహోదరులారా, మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించునని యెరిగి, మీరు నానా విధములైన శోధనలలో పడునప్పుడు, అది మహానందమని యెంచుకొనుడి" (1:2, 3). అంతములో కోరదగినవి అవి పుట్టిస్తాయన్న సంగతి మనం ఎరిగియుంటే, మనం శ్రమలను ఆనందముతో ఎదుర్కొన వచ్చు. క్రైస్తవులకు సహనం కోరదగినదైయుంటుంది. ఎందుకంటె, సహనము స్థిరత్వాన్ని, పరిపక్వాన్ని, జీవితాన్ని మధురముగా చేసే యితర గుణలక్షణాలను పుట్టిస్తుంది. "మీరు సంపూర్ణులును, అనూనాంగులును, ఏ విషయములోనైనను కొదువలేనివారై యుండునట్లు ఓర్పు తన క్రియను కొనసాగింపనీయుడి" అని తరువాత అన్నాడు (యాకోబు 1:4).

శోధింపబడు సమయంలో ఏ శ్రమయు ఆనందదాయకంగా ఉండదు. "మరియు ప్రస్తుతమందు సమస్త శిక్షయు దుఃఖకరముగా కనబడునే గాని సంతోషకరముగా కనబడదు. అయినను దానియందు అభ్యాసము కలిగినవారికి అది నీతియను సమాధానకరమైన ఫలమిచ్చును" (హెబ్రీ. 12:11). పోరాటాలు మనకు బలమునిస్తాయి.

అవి లేకుండ, “ఆయన ఏలాగు నడుచుకొనెనో ఆలాగే” నడుచుకొనుటకు మనం ఎన్నడూ నేర్చుకోలేం (1 యోహాను 2:6).

తన కిటికీ ప్రక్కన ప్యూపా దశలోనుండి సీతాకోకచిలుక వెలుపలికి రావడానికి తంటాలు పడుతున్న సంగతిని ఒక స్త్రీ గమనిస్తూ ఉంది. కొన్ని దినాలుగా అది ప్యూపా సందులోనుండి బయటపడడానికి పోరాడింది. తొలిగా తల, ఆ తరువాత దాని పైభాగం, ఆ తరువాత దాని రెక్కలు వచ్చాయి. ఆ చిన్న సందులోనుండి దాని దేహపు చివరి భాగం వెలికి వచ్చేవరకు దాన్ని చూడడానికి ఆ స్త్రీ యిష్టపడలేదు. దానికి సహాయం కావాలనే నిర్ణయం ఈ స్త్రీ చేసింది. ఆ సందును పెద్దదిగా చేసింది, దానితో సీతాకోక చిలుక తేలికగా బయటికి వచ్చింది. అయినా, దాని వెనుక భాగం ఎగురలేనంతగా ఉబ్బింది. ఆ సీతాకోకచిలుక తన కిటికీవద్దనే పడి చచ్చిపోయింది. జీవించడానికి అవసరమైన పోరాటం ఆ సీతాకోకచిలుకకు లేకుండ చేసిన సంగతి ఆ స్త్రీకి తెలియలేదు. ఆ పోరాటము సీతాకోకచిలుక యొక్క వెనుక భాగపు సైజు తగ్గించి, రెక్కల బలాన్ని పెంచియుండేది. సహాయాన్ని ప్రకృతికి విరుద్ధంగా ఆ స్త్రీ తల పెట్టింది ఆ సీతాకోక చిలుక ప్రాణానికే ముప్పు తెచ్చింది.

నీ పోరాటాల్లోనుండి నిన్ను వెలుపలికి తీయుమని నీవు దేవుని అడగవద్దు సరిగదా అలా చేసేలా ఎదురు చూడవద్దు. నీ పోరాటంలో సహించగలుగుటకు శక్తినిమ్మని, నమ్మకంగా అంతం చేరడానికి గాని విజయమిమ్మని నీవు ఆయనను వేడుకో?